Volume-01
Issue-06
June-2019

ISSN: 2663-0931(Print)
ISSN: 2663-2594(online)
International Journal of
Interdisciplinary Current Advanced Research
www.ijicar.in

# హేతువాత సాహిత్య ప్రతీక ‘ త్రిపురనేని రామస్వామి చౌదరి’

డా॥ పులపర్తి శ్రీనివాసరావు

పోస్ట్ డాక్టోరల్ ఫెలో    తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వకళాపరిషత్    విశాఖపట్నం03

Note: * Indicates corresponding author

**ARTICLE DETAILS**

**Article History:**
*Received Date: 08/06/2019*
*Revised Date: 12/06/2019*
*Accepted Date: 18/6/2019*
*e-First: 28/06/2019*

**Keywords**

*Corresponding Author

--
డా॥ పులపర్తి శ్రీనివాసరావు

**ABSTRACT**

**సంక్షిప్త పరిచయం:**

మానవుడు జన్మత: హేతువాది. ప్రతిదాని హేతువును గురించి ప్రశ్నించి సమాధానం తెలుసుకోవడం ద్వారానే, మానవుడు అభివృద్ధిని సాధించగులుగుతున్నాడు. కల్లబొల్లి కాల్పనిక సాహిత్యం ఈ హేతువనే దీపకళికను మసిబారేటట్లు చేసింది. త్రిపురనేని రామస్వామి చౌదరిగారి రచనల వలన మానవునిలోని ఆ దీపకళికను ఆవరించిన మసిని, నుసిని తొలగించివేశాయి. ఆ హేతువాద జ్యోతిని దేదీప్యమానం చేశాయి. ఆ కారణం చేతనే ఆయన ఈ నాటికీ ప్రజల నాలుకలయందు జీవించి ఉన్నారు. తెలుగు సాహిత్యంలో త్రిపురనేని రామస్వామి చౌదరి హేతువాద ప్రారంభ రచయితగా సమకాలీన సమాజం గుర్తించింది. నేటికీ ఆ రచనలు హేతువాద భావాలకు ప్రతీకలుగా నిలిచాయి.జ్ఞాన సముపార్జనకు హేతువు ప్రధాన సాధనం, గీటురాయి అని చెప్పే ఒక దర్శనం హేతువాదం. ఈ హేతువాదంలో మత సంబంధమైన ప్రకృతికి అతీతమైనవిగా భావింపబడే వాటిని గురించి చర్చించి, అవి ప్రాకృతికమైనవేనని నిరూపించడం ప్రధానంగా కనిపిస్తుంది. ఈ కోణంలో త్రిపురనేని రామస్వామి చౌదరిగారి సాహిత్యం తెలుగులో హేతువాద సాహిత్యానికి ప్రతీకగా నిలబెట్టవచ్చు. ఈయన హేతువాద దృక్పథం ఏపాటిదో తెలియజేసేదే ఈ వ్యాస మఖ్యోద్దేశ్యం.

## కవి పరిచయం:

కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరిగారు 1887 సం॥ జనవరి 15వ తేదీన త్రిపురనేని బలమయ్యగారు, శ్రీమతి రామమాంబ గారికి పంచమ సంతానంగా జన్మించారు. సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమం, ఆంగ్ల విద్యావిధానాల ప్రభావంచే ప్రభావితమైన ఆంధ్రదేశం ఆ తదుపరి ఎన్నో ఉద్యమాలకు కొలువైంది. మరి ముఖ్యంగా సామినేని ముద్దు నరసింహనాయుడు, కందుకూరి, గురజాడలు నిర్మించిన హేతువాద పునాదులపై అందమైన భవంతిని నిర్మించినవారు కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి, తాపీ ధర్మారావు, గుఱ్ఱం జాషువా, గోరా, ఆవుల గోపాల కృష్ణమూర్తి, నార్ల వేంకటేశ్వర రావు, పెండ్యాల వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, కొప్పరపు సుబ్బారావు, ఆరుద్ర, యలమంచిలి వెంకట సుబ్బయ్య, గౌరు బోయిన పోలయ్య చలం తదితరులు. వీరిలో శ్రీ త్రిపురనేని రామస్వామి చౌదరిగారిని తెలుగు సాహిత్యంలో హేతువాదానికి మూల పురుషుడిగా పేర్కొంటారు. నూతన సమాజాన్ని నిర్మించుకోవాలంటే ముందుగా భావదాస్యం పోగొట్టి కొత్త ఫిలాసఫీని  రూపొందించుకోవాలనే విశ్వాసంతో హేతువాత ప్రచారార్థమే ఆయన సాహిత్యాన్ని సృష్టించారు. ప్రజలలో భావ విప్లవం రావాలంటే ముందుగా వారిలో పేరుకుపోయిన మూఢ విశ్వాసాలు పోవాలని ప్రజలలో మౌఢ్యాన్ని పెంచుతున్న మతాన్ని ప్రచారం చేసే పురాణాలను, కృత్రిమ అసమానతలు సృష్టించిన స్మృతులను హేతువాత దృక్పథంతో విమర్శించారు.

చౌదరిగారి రచనలైన ‘శంభుక వధ’, శూత పురాణాల్లో వేత ప్రామాణ్యాంవ అంగీకరించే భావాలు కనపడినప్పటికే తరువాతి రచనలైన ఖూనీ, భగవద్గీతలలో ఆయనలో హేతువాదం సంపూర్ణ రూపంలో

ప్రకటితమైంది. త్రిపురనేని రామస్వామి చౌదరిగారి కుమారుడైన త్రిపురనేని గోపీచంద్ తన నవల "అసమర్థుని జీవిత యాత్ర"ను తన తండ్రి త్రిపురనేని రామస్వామి చౌదరికి అంకితం ఇచ్చారు.

త్రిపురనేని రామస్వామి చౌదరిగారి రచనల్లో ముఖ్యంగా సూత పురాణం, భగవద్గీత, గీతాలు, శతకాలు, కుప్పుస్వామి శతకం, ధూర్తమానవా శతకం, వివాహవిధి అనేవి రాసారు. అంపకం, మాలదాసరి, నరకం, గోపాల రాయ శతకం, పల్నాటి పౌరుషం, రాణా ప్రతాప్ మొదలగునవి అముద్రితాలుగా మిగిలిపోయాయి. ఆంధ్రసాహిత్యంలో 'సూతపురాణం' ప్రచురణతోనే హేతువాద సాహిత్య యుగం ప్రారంభమైందని చెప్పవచ్చు.

చౌదరిగారి రచనల్లో ఆయా సందర్భాలను బట్టి కొన్ని లక్షణాలు వ్యక్తంగాను, మరికొన్ని లక్షణాలు అవ్యక్తంగాను కనబడతాయి. 'హేతువాదం' అనేది ఆత్మగాను, జామాజిక, చారిత్రక, ఆదర్శ, మానసిక దృక్పథాలు మూలస్తంభాలుగా గమనించాలి. ముఖ్యంగా సమాజంలో నెలకొన్న సామాజిక రుగ్మతలు, వర్ణవ్యవస్థ నిరసన, బ్రాహ్మణ ఆధిపత్య నిరసన, వైదిక యజ్ఞయాగాదులు పట్ల నిరసన, మాఢాచారాల పట్ల నిరసన, కర్మ, పునర్జన్మ సిద్ధాంతాల పట్ల నిరసన, విగ్రహారాధనను నిరసించడం అను అంశాలపై చర్చించడం జరిగింది. దీన్నే సామాజిక దృక్పథంగా పరిగణించవచ్చును.

త్రిపురనేని 'శూద్ర' సామాజిక వర్గానికి చెందినవారు. ఆర్థికంగా పరిపుష్టి కలిగినా ఆనాటి సామాజిక అసమానతలకు కూడా గురయ్యారు.

**వర్ణవ్యవస్థను నిరసించడం:**

సంస్కృతంలో వర్ణము అనగా రంగు అని అర్థం. అంతేకాని కులం అని అర్థం కాదు. ఋగ్వేదకాలంలో చేసిన శ్రమ విభజన క్రమంగా బలపడి ఋగ్వేదానంతర కాలం నాటికి కుల విభజనగా రూపాంతరం చెందింది. సమకాలీన ఇండో – యూరోపియన్ జాతులతో, ప్రాచీన ఇరాక్‌లోని నాలుగు రకాలైన ఈస్టర్స్ లేక తరగతులుగా విభాగించుకోవడం ఉండేవి. బహుశా ఆర్యులు వీరిని అనుసరించి ఉంటారు. అయితే సిద్ధాంత పరంగా ఆర్యులందరూ ఈ చతుర్వర్ణ విభాగంలో భాగస్తులే కాని పిల్లలు, ఋషులు, వితంతువులు మాత్రం ఈ విభాగం నుండి మినాహాయించారు. అయితే ఈ వర్ణ విభాగం మన దేశమందు క్రొత్త పుంతలు తొక్కింది. భారతదేశాన్ని ఉత్తరం వైపునుండి దండెత్తి వచ్చిన ఆర్యులు నాడు స్థానికంగా ఉన్న ప్రజలతో యుద్ధం చేసి వారిని పరాజితుల జేసి వారిని సంఘంలో అథమ స్థానాన్ని కల్పించారు.

కాల క్రమేణ వారి జీవనాన్ని క్రమబద్ధం చేసుకోవడానికి వారిలో వారు వర్ణ భాగాన్ని సృష్టించుకున్నారు ఈ వర్ణ విభాగం యొక్క ప్రస్తావన ఋగ్వేదంలోని పురుషసూక్తంలో ఉంది. దీనిలో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అను నాలుగు రకాలుగా ఉన్నాయి. కాలక్రమేణా ఈ వర్ణవిభాగం బలపడి ఒక వర్ణంలోనికి మరో వర్ణం చొరబడే అవకాశం లేకపోయింది.

అయితే వర్ణవిభాగం దక్షిణ భారతదేశంలోకి చాలా నెమ్మదిగా ప్రవేశించింది. ప్రాచీన తమిళ సాహిత్యంలో జాతిపరమైన విభేదాలు కొన్ని హెచ్చుతగ్గులతో కూడి ఉన్నాయి తప్ప వర్ణ విభాగమనేది లేదు. క్రమంగా ఈ వర్ణవ్యవస్థ దక్షిణ భారతంలో ప్రవేశించి బలపడి ఉత్తర భారతదేశంలో నెలకొన్న వర్ణవ్యవస్థ కన్నా కఠినతరమైంది.

ఈ వర్ణవ్యవస్థను హేతుబద్ధంగా విమర్శిస్తూ త్రిపురనేని రామస్వామి చౌదరిగారు తమ సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. రామస్వామి గారి దృష్టిలో వర్ణవ్యవస్థ అనేది ప్రారంభంలో లేదంటూ–

"తొలు దొలుత భూత సృష్టిని సలుప వేళ
గులములుంగాని, యెచ్చులొచ్చులును గాని
నేను గల్పింపగా లేదు నేడు చూడు
తారతమ్యమే విధముగా దారుకొనెను"

అని తమ భగవద్గీత యందు పలనాటి బ్రహ్మనాయుడి నోట భూమిపై సృష్టి జరిగే నాటికి కులం గానీ, వాటియందు హెచ్చుతగ్గులుగాని లేవని, నేడు చూస్తే ఈ తారతమ్యాలు మిక్కిలిగా ఉన్నాయని రచయిత వర్ణించారు.

**మరణం – పునర్జన్మ:**

మృతిని పొందిన మనుజులు ఏమౌతారనే చర్చ కూడా త్రిపురనేని రామస్వామి చౌదరిగారు చేశారు. పిండ ప్రధానములు చేయుట తదితర ఆచారాలను సైతం హేతుబద్ధంగా విమర్శ చేశారు. కుప్పుస్వామి శతకంలో ఇలా అన్నారు.

చచ్చిపోయిన వెంటనే జన్మమెత్తు
జీవి కుడువ గర్మమటంబు జెప్పుచుండు
రట్టులైనచో బిత్రులోకమెట్టువచ్చు?
గుటిల జనసృష్టి గాదొక్కొ కుప్పుస్వామి

చనిపోయిన తర్వాత మనిషి మరలా జన్మిస్తాడని, చనిపోయిన వారికి పిండ ప్రదానం చేయడం ద్వారా వారి ఆత్మను తృప్తి పరచవచ్చని తద్వారా వారికి సద్గతులు కలుగుతాయని చెప్పేమాటలు కుటిల బ్రాహ్మణులు కల్పించిన సృష్టియని త్రిపురనేని రామస్వామి చౌదరిగారి అభిప్రాయం. చనిపోయినవారు ఎక్కడికి వెళ్తారనేది ఎవరికీ తెలియదని, ఎక్కడ ఉంటారో తెలియని, జీవంలేని మనుషులకు పిండాలు పెట్టడం నిర్హేతుకమైనందని చెప్పారు రచయిత.

ఈ రీతిలో పునర్జన్మ అనునది కుటిల జనసృష్టి అని, పిండ ప్రదానాలు కేవలం ఆప్తులను, సదరు కర్మకాండను నిర్వహించి లాభపడు భోక్తలను, పురోహితులను తృప్తి పరచడానికి పెట్టుకున్నవి గాక వేరొక్కటి కావని అంతేకాక మరణం, పునర్జన్మ మానవునికి అతీతమైంది. మానవ ప్రమేయం లేదని రచయిత తెలియజేశారు

**బ్రాహ్మణ ఆధిపత్య నిరసన:**

త్రిపురనేని రామస్వామి చౌదరిగారు తమ సాహిత్యమంతటా బ్రాహ్మణ ఆధిపత్యాన్ని నిరసించారు. భారతీయ సమాజంలో వర్ణపరమైన విభేదాలు కలుగజేసింది బ్రాహ్మణులే అని వారి అభిప్రాయం. వైదిక ధర్మమను పేరుతో బ్రాహ్మణులు చేసిన పున: సృష్టివల్లనే సమాజం నేడీ రీతిగా ఉందని వారి అభిప్రాయం. అయితే ఈ బ్రాహ్మణ సృష్టికి ఏ విధమైన హేతబద్ధతా లేదని చెబుతూ భగవద్గీతలో పలనాటి బ్రహ్మనాయుడు

"వైదిక ధర్మముంజెఱుప స్వార్థపరాయణ చిత్తులైత్రయీ
వేతుల మంచు గొందఱు వివేకము వీడి స్మృతుల్ రచించిత
ద్వైదిక ధర్మసారమని వాకొనినారు కుమార! యిట్టి దు
ర్వాదము మాపకున్న యెడ వర్ధిలు దప్పక ధర్మ పాడలున్"

కొందరు వివేకాన్ని విడిచిపెట్టి స్మృతులు రచించారని అందు నిర్హేతుకమైన విషయాలను వల్లెవేసి నేటి ఈ అధర్మానికి కారకులైనారని నిరూపించారు. అంతేగాక

"వేళాకోళము గందఱ
గోళమ్మును జేసి ద్విజుల గురించి మహో
ధీలముగా వర్తించిరి
కాలము కర్మం బీకటయి కారింపగా"

అంటూ ద్విజుల యొక్క దుష్క్రియలను విమర్శించారు. అలాగే అవతారాలను సృష్టి చేయడంలోనూ, దురాచారాలను పాదు కొల్పడంలోనూ, సంప్రదాయం పేరిట తమకు అనుకూలమైన ఆచార వ్యవహారాలను

© IJICAR 2019, All Rights Reserved 

ప్రజలయందు పాదుకొల్పడంలోనూ వారి యొక్క కృషి అవిరళనీయమైంది. అన్నింటిలోనూ బ్రాహ్మణులు పై చేయిగా ఉంటూ, అగ్రవర్ణాల వారమని అంటూ కింద కులాలవారిని నీచంగా చూసేవారు. అందుకు నిదర్శనంగా రచయిత ఆవేదనాత్మకంగా రచించినట్లు కన్పిస్తుంది.

**వైదిక యజ్ఞయాగాదులు కర్మకాండలు, మూఢాచారాల పట్ల నిరసన:**

త్రిపురనేని రామస్వామి చౌదరిగారు ఆంగ్ల విద్యా పారంగతులు కావడంతో పాటు ఇంగ్లాండ్ తదితర దేశాలు తిరిగి రావడంతో ఆయా దేశాలలో ఉన్న సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితులు అధ్యయనం చేశారు. అందువల్లనే పాశ్చాత్య దేశాలలో ఉన్న నలుపు, తెలుపు అన్న వర్ణ వివక్షతనూ, అదే రీతిగా ఆయా దేశాలలో సైతం నెంబర్ 13 హోటల్ గదిలో ఎవ్వరూ దిగకపోవడం వంటి దురాచారాల పట్ల ఆయనకు విముఖత వుంది. సదరు ఆచార వ్యవహారాలకు ఏ విధమైన హేతువూ లేదని వారి అభిప్రాయం. అందుచేతనే వారు తమ సాహిత్యం ద్వారా ఆయా వ్యవహారాలలో ఉన్న హేతుబద్ధతను ప్రశ్నించారు. వాటి మూలాలను ఖండించారు. 'భగవద్గీత'లోని కర్మయోగమందు త్రిపురనేని రామస్వామి చౌదరిగారు బాలుడి నోటి యజ్ఞ యాగాదుల యొక్క ఔచిత్యాన్ని హేతుబద్ధంగా ప్రశ్నించారు.

"యజ్ఞముల జేయనేల? యా యజ్ఞఫలము
పొంటె రాత్రిందివమ్ములు పొక్కి పొక్కి
దేవతల బట్టికొని యేల దేవురింప?
యజ్ఞముల మాన నష్టమేమైనా గలదె?

యజ్ఞాలు ఎందుకు చేయాలి? అవి చేయకపోతే కలిగే నష్టమేమిటి? ఈ యజ్ఞఫలం కోసం దేవతలు వేవురించడమెందుకు? అంటూ యజ్ఞములు చేయడంలోగల హేతుబద్ధతను తేటతెల్లం చేశారు రచయిత.

యజ్ఞముల తోడ సృష్టించె నఖిల జనుల
దొల్లి భగవంతుడని చెప్పుదురు నిరంత
రంబు పండితమ్మన్యులు బ్రహ్మమేని!
వారి మాటలు విస్రంభపాత్రమౌనె?"

అని యజ్ఞాలు చేయడం వల్లనే ఈ భూమిపై భగవంతుడు సృష్టిని చేశాడని, పండితులు చెబుతారని, వారి మాటలు నమ్మదగినవి కావని రచయిత పేర్కొన్నారు. యజ్ఞయాగాదుల వలన మనకు నష్టమేగానీ లాభం లేదని కవి భావన.

**కర్మ – పునర్జన్మ సిద్ధాంతం:**

త్రిపురనేని రామస్వామి చౌదరిగారికి కర్మ సిద్ధాంతం, పునర్జన్మ సిద్ధాంతాలపై ఏ విధమైన నమ్మకం లేదు. వారి దృష్టిలో కర్మ పునర్జన్మలకు ఎటువంటి హేతుబద్ధతా లేదు. అందుచేతనే వారి అభిప్రాయాలను నిష్కర్షగా తమ సాహిత్యంలో పొందుపరిచారు. ధూర్త మానవా శతకంలో రామస్వామిగారు–

"మరణపు శయ్యమీద నొక మారయినన్ నను దప్పకుండ సం
స్మరణము చేసినంతటనె స్వర్గము వచ్చునటందు, వేగతిన్
బొరయును? నిట్లె నీవెపుడు బొంకుచునుందువు దీనికైనినున్
గటికర గొంతు కోసెదను కానివి చెప్పకు ధూర్తమానవా!"

స్వర్గం అనేది ఉంది అని చెప్పడానికి ఏ విధమైన హేతువు లేదని, అలా ఉందని నిర్హేతుకమైన మాటలాడినచో గొంతు గరకర కోస్తానని హెచ్చరించారు. కర్మ, పునర్జన్మల సిద్ధాంతాలు తప్పు అని దుయ్యబట్టారు కవి.

© IJICAR 2019, All Rights Reserved

"చచ్చిన పిదపన్ నరకమె
వచ్చునొ స్వర్గంబొ యూడిపడునో చెప్పన్
వచ్చునె యెవ్వనికనియు
నిచ్చకముల చెప్ప లాభమేమి మహాత్మా!"

అని అంటూ రామస్వామిగారు స్వర్గం, నరకం, ఆత్మ అను వస్తువులు ఉన్నవో లేవోనని, ఉన్నవని నమ్మటం తప్పు అని అంటారు.

ఆత్మయును వస్తువున్నదో యసలు లేనె
లేదో నాకు నమ్మిక గ్లగలేదు గాన
మొయిలులో నీరు నమ్మియే మూర్ఖుడైన
జెఱవు కట్టల దెగనొట్టి చెఱుపగలడె

అని రామస్వామిగారు ఆత్మ అనేది ఉందో లేదో ఎవరికీ తెలియదు కానీ ఆత్మ అని మాట్లాడతారు. కానీ ఆత్మ ఉందనే భ్రమలోనే చాలామంది బ్రతుకుతారు. "మొయిలులో" లేని నీరు ఉందని భ్రమించడం తప్ప వేరొకటి కాదని, ఆ లేని నీరును ఉందని భ్రమించి చెరువు కట్టను తెగ్గొట్టుకొనుట యుక్తం కాదని పలికారు.

**మూఢాచారాల పట్ల నిరసన:**

మూఢాచారాల్లో ముందుగా త్రిపురనేని రామస్వామి చౌదరిగారిని బాధించింది జంతుబలులు. సూత పురాణంలో జంతుబలులు గూర్చి రాసారు. భగవంతుని పేరు చెప్పి జంతుబలులు చేయడం సమంజసం కాదని, విజ్ఞానం కల్గిన మానవులు చేయదగని పని అని వక్కాణించారు. త్రిపురనేని గారు రచించిన 'కుప్పుస్వామి' శతకంలో ఈ జంతుబలులు గూర్చి ఇలా అన్నారు.

"మాంసం భుజింప నిచ్ఛించి మానవుండు
మ్రొక్కు మ్రొక్కంచు దేవుని ముందుబెట్టి
గొంతుకోసి యే మృగమునో కుడుచుచున్న
గోపపడకున్నే దేవుండు? కుప్పు స్వామి"

అని మాంసాన్ని తినాలనే ఇచ్ఛతోనే మానవుడు దేవుని మొక్కు పేరు చెప్పి బలులు ఇస్తున్నాడు. ఇది చూసిన దేవుడు తప్పక కోప్పడతాడని పలికారు. వీరు రాసిన సూతపురాణంలో జంతు బలుల విషయమై ద్వితీయాశ్వాసంలో ఇలా అన్నారు.

"వింటి కోపు మీద వీర రక్తము జల్లి
పలుక వాలునకును బలులు వెట్టి
మూగ దేవరులకు మ్రొక్కుబడులు దీర్చి
పైనమైరి రిపుల బారి సమర"

అని అంటూ ఆర్యులతో పోరాడటానికి ద్రావిడ యోధులు సన్నద్ధులైనారని, అందుకు ప్రతిగా ఆర్యుల ప్రతిక్రియను సూత పురాణంలో రచించారు. నోరులేని మూగ జీవాలను మాట్లాడలేని దేవుని పేరు చెప్పి మానవులు చేసే ఈ అజ్ఞానాన్ని ఆయన ఖండించారు

**విగ్రహారాధన పట్ల నిరసన:**

త్రిపురనేని రామస్వామి చౌదరిగారు విగ్రహారాధన, ప్రతిమల పెండ్లి చేయుట వంటి దురాచారాలను సైతం హేతుబద్ధంగా విమర్శించారు. కుప్పుస్వామి శతకంలో-

© IJICAR 2019, All Rights Reserved 

"ముక్కు మొగము జెక్కమూల విరాట్టించు
నొక్కరాయి దెచ్చి యుంచి గుడుల
గూడు గుడ్డలిచ్చి కొల్తురు ప్రజలెల్ల
గొంటె పగులు గావె కుప్పుస్వామి"

అని విగ్రహారాధన గురించి రచయిత రాయిలకి, రాళ్ళకి మొక్కడం సరైంది కాదని ప్రతీ మనిషిలోనూ దైవం ఉంటుందని దాన్ని వదలి గుడులు, గోపురాల వెంట పరుగులు పెట్టరాదని, ప్రజలు మూర్ఖంగా ఆలోచిస్తూ ఉన్నారని పేర్కొన్నారు.

ఈ టకటొంకు లేమిటికిని? నిల్లును వాకిలి గట్టిపెట్టి యే
టేటను బెండ్లి నేయుమని యే నెప్పుడైనను గోరియుంటినే
చీటికి మాటికిన్ బరుల జేబుల గొట్టుట ధర్మమార్గమే?
ఏటికి నీయబద్ధ మరలే! యిక సాగునే? ధూర్తమానవా!

అంటూ విగ్రహారాధనలో ఉన్న వాస్తవికతను విమర్శిస్తూ, మరొక చోట భగవంతుడే ధూర్తమానవునితో నాకు ఏడాదికోసారి వివాహం చేయమని నేను కోరలేదని పల్కడం త్రిపురనేని రామస్వామి చౌదరిగారి హేతుబద్ధతకు నిదర్శనం. ఆయనకు మూఢ విశ్వాసాల పట్ల ఉన్న వ్యతిరేకతను హేతువాద ధోరణిలో–

"శాస్త్రముల నెల్ల జదవి విజ్ఞాన మెరిగి
సంశయింపక సర్వదా చర్చజేసి
నిజమెఱుంగవలయు నిది నేర్పకున్న
మూఢ విశ్వాసమున జేటు మూడుచుండు"

అని అంటూ చివరిగా తమ భగవద్గీత నందు ప్రజలకు హితబోధ చేయుచూ శాస్త్రాలను చదివి విజ్ఞానం పొంది ఆ తదుపరి తమకు కలిగిన జ్ఞానాన్ని పదిమందితో చర్చ చేసి నిజం తెలుసుకోవాలని, అంతే తప్ప మూఢ విశ్వాసాలను యథాతథంగా అవలంబించడం వల్ల చేటు కలుగుతుందని తన భగవద్గీత ద్వారా పాఠకులకు సత్యాన్ని ఉపదేశించటమే కాకుండా విగ్రహారాధనని తీవ్రంగా ఖండించారు.

**ముగింపు:**

హేతువాదాన్ని ఆచార్య లాసే, బౌర్కు తదితర పాశ్చాత్య లాక్షణికులు, ఎన్ సైక్లోపీడియా ఆఫ్ బ్రిటానికా, అమెరికాలు భిన్నంగా నిర్వచించాయి. త్రిపురనేని రామస్వామి చౌదరిగారు ప్రక్రియా పరంగానూ, వస్తు పరంగానూ ఆయన రచనలు పేర్కోవటం జరిగింది. సామాజిక దృక్పథంలో భాగంగా వర్ణవ్యవస్థ, బ్రాహ్మణ ఆధిక్యత, దురాచారాలు, సనాతన ఆచార వ్యవహారాలు బ్రాహ్మణ కల్పితాలని ఇరువురి అభిప్రాయం. అట్లే చారిత్రాకాంశాలైన ఆర్యుల దురాక్రమణ, పురాణ పురుషుల ఔన్నత్యం అనే అంశాలు గూర్చి తెలియజేశారు.

నిజానికి హేతువాదం ఒక వాదం కాని, సిద్ధాంతం కాని, తత్త్వం కాని కాదు. నిత్యాభివృద్ధి చెందే విజ్ఞానాన్ని అన్వయం చేసుకొని, ఎప్పటికప్పుడు దానికి అనుగుణమైన ఆలోచనా విధానాన్ని అనుసరించేందుకు తోడ్పడేదే హేతువాదం. హేతువాదమనే పదం ఉచ్చరించకుండానే మన ప్రాచీన దార్శనికులు తమ దర్శనాల్లో కార్యకారణ రూపంలో కొంత తర్కించారు. భారతీయ సాహిత్యంలో హేతువాత భావనలు ఉన్న తొలి గ్రంథాలు ఉపనిషత్తులు. ఇవి ఆనాటి సమాజంలో ఉన్న క్రతువులు, కర్మకాండలను నిరసిస్తూ చర్చారూపంలో వెలువడ్డ గ్రంథాలు. ఆ తదుపరి బౌద్ధంలోను, ప్రాచీనుల షడ్దర్శనాలలోని వైన సాంఖ్య వైశేషికాల్లోనూ ఇప్పటి హేతువాద ఛాయలు ప్రస్ఫుటంగా కన్పిస్తాయి. ప్రతీకార్యానికి కారణం ఉంటుందని, కారణం లేని కార్యం ఉండదనే

© IJICAR 2019, All Rights Reserved 

కణాణుడి వైశేషికం అంటుంది. అయితే హేతువాదానికి బాగా దగ్గరి పోలికలు గల ప్రాచీన దర్శనం లోకాయుతం. ఋగ్వేద కాలం నాటికే లోకాయుతం బాగా ప్రచారంలో ఉండేదని ఆర్యోక్తి. ఇహలోకాన్ని ఆధారంగా చేసుకున్న దర్శనం కనుక ఇది లోకాయుతమయిందని కొందరంటారు. అభౌతిక, పారలౌకిక తత్త్వాలను యజ్ఞయాగాలను విశ్వసించని లోకాయుతం అర్థ కామ సాధనలే ప్రధానమని భావించి, అందువల్ల అర్థ, కామ శాస్త్రాలకు సంబంధించిన గ్రంథాలు లోకాయుతులే రచించారని అంటారు. అందువలననే మనుస్మృతి లోకాయతులను హైతికులు, నాస్తికులుగా పేర్కొంటుంది. అంతేగాక ఈ లోకాయుతులు వేద పారాయణాన్ని, పరలోకాన్ని, యజ్ఞయాగాలనూ, నిరాకరించిన పాషండులు కనుక వీరు శిక్షార్హులని మనుస్మృతి చెబుతుంది. అయనప్పటికీ పూర్వకాలంలో రాజధర్మం మొత్తం మీద లోకాయుత సూత్రాలపైనే నడిచింది అని కౌటిల్యుని అర్థశాస్త్రం చెబుతుంది.

**ఉపయుక్త గ్రంథాలు:**

1. ద్వానా శాస్త్రి – తెలుగు సాహిత్య చరిత్ర –2011
2. తాపి ధర్మారావు – పెళ్ళి దాని పుట్టు పూర్వోత్తరాలు – విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
3. కె.కె.రంగనాథాచార్యులు – ఆధునిక తులుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు
4. కవిరాజు సాహిత్యం – 1. సూత పురాణం– విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2011
5. కవిరాజు సాహిత్యం – 2. భగవద్గీత – విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2011

© IJICAR 2019, All Rights Reserved 